చిన్నకథ

# లాటరీ టికెట్టు

కూరెళ్ల రామనరసింగరావు

రాత్రి యెనిమిదిగంటలైనది వామనుడు భోజనము జేసి సోఫాపై కూర్చునియుండెను ఆ సాయంకాలమే వచ్చిన 'ఆంధ్రరాణి'ని జదువుటకుఁ దీసెను

వామనునకు సంవత్సరమునకు రెండువేల రూపాయిలు రాబడి దురభ్యాసములు, దుస్సహవాసములు నతనికి లేకపోవుటచే నా యాదాయమున సుఖముగఁ గాలముఁ గడపుచుండెను

"పని తొందరలో 'ఆంధ్రరాణి'ని జూడ మరచితినండీ. ఇవాళ లాటరీ ఫలితములు ప్రచురింపఁ బడునని సంపాదకులు క్రిందటి పత్రికయందు సూచించిరి లాటరీగూర్చి మొట్టమొదటఁ జూడుడు తరువాత మీకు కావలసిన విషయములు-యుద్ధవార్తలు-కాంగ్రెసు సమాచారములు-వాణిజ్యవీధి-క్రీడారంగము-సినీమాపుట- చూచుకొనవచ్చున"ని వంటింటినుండి చావడిలోనికి వచ్చుచు పూర్ణయనెను

'టికెట్ నెంబరు'? అని యతఁడు పత్రికపుటలు వడివడి తిరుగవేయుచుండెను

'పుస్తకము నెంబరు వెయ్యి టికెట్ నెంబరు 23

వామనునకు లాటఁ     స్మకములేదు 'కష్టేఫలీ' యను వాక్యమే యతనికి గురువాక్యము అదృష్టవశమున నెట్టిధనము దనకు సంప్రాప్తించుట దుర్లభమని యతని యభిప్రాయము కాని పూర్ణమాట నతఁడు త్రోసివేయలేకపోయెను భార్య వాంఛితము ప్రకారము సంచరింపని భర్తలరుదుకదా!

"ఎనిమిదవ పుటయందు రెండవ 'కోలము'నందు 'లాటరీ ఫలితము లను శీర్షిక (పెద్దయక్షరములతో నున్నది) యతనిదృష్టి నాకర్షించెను చూచీ చూచుసరికి రెండవ పఙ్క్తియందే వెయ్యి సంఖ్యగలదు ఆ సంఖ్యను వామనుఁడు కండ్లారఁజూచి యానందభరిత హృదయుఁడై, తత్పరవశ్యమునఁ బత్రికను క్రిందకుజార్చెను విస్ఫారితనయనుఁడై, తాను జూచిన సంఖ్య వెయ్యియగునో కాదో— ఆ విషయవు సిద్ధాంతీకరించుకొనుటకు—మరల పత్రికను వీక్షించెను వామనుఁడు తనకు దృష్టిలోఁగూడనే లోపము లేదని యతఁడు నిర్ధారణముఁ గావించుకొనెను సంతోషమునఁ బొంగిపోవుచు "పూర్ణా! వెయ్యిసంఖ్యయందున్నది. నీ బూరె నేతిలోబడినద"నెను

"నిజమే! మీ మాటలు నమ్మవచ్చునా! హాస్యము కాదుగదా!" యని పూర్ణ బహు ఆతృతతో నడిగెను

"నీతోనే నబద్ధమాడగలనా?" "ఇదిగో నామాట నమ్మనియెడల నీవే చూడుము" అని పత్రికనందీయ 'నాకు మీమాట చాలదా? నేను హాస్యమున కంటిని గాని మీమాట నమ్మకయా?" యని యామె ప్రత్యుత్తరమొసంగెను

అ ప్రయత్నముగ, అయాచితముగ, అతి సులభముగ, నదృష్ట పూర్వకముగఁ దమకు లభించిన మహాద్భాగ్య

మునకు భార్యాభర్త లిరువురు అపారమగు సంతోషమును పొందిరి వారి మోములు చక్కగ వికసించిన పద్మముల వలె నొప్పారుచుండెను ధనము లభించుచున్నదనిన సంతసమొందనివారుందురా ? ధనమనేక సౌఖ్యసాధనము కదా !

"మన పుస్తకముసంఖ్య గెలుపొందిన సంఖ్యలలో నున్నది మనకు ధనము లభించుటకెట్టి యాటంకములేదు"

"ఆ సంఖ్యయే పక్తియందున్నది ?"

"రెండవ పంక్తియందు"

"రెండవ పంక్తియందే" "ఏమి యదృష్టవంతు లము మనము"

"మనకెంత ధనము ప్రాప్తించును"

"ఒకలక్ష" "అదియే మొదటిపంక్తియందున్న రెండులక్షలు వచ్చియుండును" "మనకంత యదృష్టమా"

మర్త్యులకు తృప్తి యెందైననుండునుగాని ధనమున మాత్రముండుటకల్ల

"లక్షరూపాయిలనిన తక్కువా"

"మీమాట బాగుగనున్నది రెండులక్షలకన్న నొకలక్ష తక్కువకదా ? మీకు లెక్కలు నేను చెప్ప వలెనా ?"

"ఎంత లభించిన నంతతో తృప్తి మన మొంద వలెను తృప్తియే సంతోషము అసంతృప్తియే దుఃఖము"

ఏది యెట్లైనను లక్షరూపాయలు_లాటరీమూలమున లభించుట నిశ్చయము దంపతు లిరువు రొకరిమొగ మొకరు చూచుకొనుచుండిరి ఆ సొమ్ము వ్యయమొన ర్చుట యెట్లు ? అందువలన నెంత కీర్తివచ్చును ? ఏయే బిరుదములు వచ్చును ? ఏయే మహోన్నత పదవులుచేఁ జిక్కును ? అను భావపరంపరలు వామనుని హృదయమున విజృభింపఁ జొచ్చెను. వెయ్యి, లక్ష, ఈ సంఖ్యలే, యావధూవరుల మనోనేత్రములకు గోచరించుచుండెను, వారి శ్రవణముల ప్రతిధ్వనించుచుండెను

వామనుఁడు సోఫాపైనుండి లేచి గదియందు పచారు చేయుచుండెను. లక్షాధికారిరీవి యతనియందు అప్పుడే మూర్తీభవించెను

"లక్షరూపాయిలు లభించిన నా జీవితకధయంతయు మారిపోవును ఇంకొక యవతారమన్నమాట పూర్ణదై పోయినది యా టిక్కట్టు నాదేయైనచో-ఆ సొమ్ము రాకమునుపే-ఏ సాహుకారునకో పత్రమైనవ్రాసి పాతిక వేలుపెట్టి బంగారముపండు భూమిని కొననా ? ఇంకొక పాతికవేలతో నొక దివ్యమైన మహల్-పూలతోటలు-సోఫాలు, కుర్చీలు-తివాసీలు-రేడియో-రంగుగోడలు-గోడలపై చిత్రములు స్నేహితులు - స్నేహితరాండ్రు - విదేశ ప్రయాణము" "భూమినిగొనుట చాల మంచికార్యము శుభ్రమైన బియ్యము ప్రశస్తమైన పాడి, కూరలు, పండ్లు, మన కపరిమితములు" తామనుని గగనసౌధ నిర్మాణమున కడ్డులేదు అంతులేదు

"చల్లనిగాలి, పండువెన్నెల, రమ్యమైన ప్రకృతి ఉద్యానవనములో వామనుఁడుండెను కుమారుఁడు, కుమారియు నాడుచుఁ బాడుచు వచ్చిరి వారివెనుక లక్ష్మీ దేవివలె శిరము మొదలు పాదములవరకు నలంకారముల ధరించి, మంద గమనముతో, మందహాసముతో, పరిమళ సంపదతో, పూర్ణవచ్చెను ఆ హొయలు, ఆకులు కులు, ఆ శృంగారము, ఆ సౌందర్యముచూచి వామనుఁడు సౌఖ్య సామ్రాజ్య సింహాపీఠము నధిష్ఠించును ఎన్నిదినము లైన నట్లు సుఖింపవచ్చును ఉదయమగుసరికి ప్రాణములు తెంచుకొని కచేరీకి పరుగెత్త నక్కరలేదు కచేరీ యెటు వైపు నున్నదో చూడనక్కరలేదు నిర్జీవము, నిరుత్సాహ కరమునగు కచేరీకి స్వస్తి చెప్పవచ్చును ఆ కాగితములు, ఆ పరిచర్య, యయ్యధి కారవర్గ విజృంభణ, ఆ గొడవ, యంతయు నతఁడు మరువవచ్చును సాయంకాలమగుసరికి వెచ్చనినీట సువాసనల వెదజల్లు సబ్బుతో స్నానమొనర్చి భోజనాంతరము కర్పూరగ తాంబూలము సేవించి పూర్ణితో నానందవార్ధి నోలలాడవచ్చును"

పూర్ణకుఁగూడ నాలోచనా పరంపరలే "ఎచ్చటి భూములు సస్యవంతములు ? ఏ రైతులు శిస్తులు బకాయి

పెట్టకుండ, కోర్టులకు ద్రిప్పకుండ, చికాకులు పెట్టకుండ నుందురో? ఇంతకు భూముల గొడవనాకేల? అది మగవారిపని వజ్రములు దాపించిన తమ్మెట్లు, వజ్రపుటుంగరములు, వజ్రము లతికించిన గాజులు-సర్వము వజ్రములమయమై పోవలెను జమీందారిణీగారు నన్నుజూచి తల వంచుకొనవలెను గడియకొక చీర మార్చవలెను”

వామనునకు మరల నాలోచనా ప్రవాహము “ఈ క్షణమే యుద్యోగమునకు రాజీనామా నిచ్చెదను నాయంతవాడను నేను నేనే పదిమంది కుద్యోగము లిచ్చెదను పురపాలక సంఘమునకు సభ్యుడనయ్యెదను అసహ్యము, అనారోగ్యము, అతి వికారముగనున్న యీ పురము నింద్రలోకముఁ జేసెదను నేను మోటారులో నేగుచుండ పురవాసులందరు వంగివంగి నమస్కారములు చేసెదరు ఆంధ్రపత్రికయందు, ఆనందవాణియందు, భారతియందు ఇందు అందు నననేల-పేరుగల ప్రతి ప్రతికయందు నా పటములు ప్రకటింపఁబడును కలకత్తానుండి, కాశీనుండి, ఢిల్లీనుండి నన్ను వివిధ సమావేశములకు నధ్యక్షునిగ, బిలిచెదరు పిదప విదేశముల కేగుట”

విదేశములఁగూర్చి తలంపు పుట్టిన తోడనే ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు జ్ఞప్తికివచ్చినవి వామనునకు అతని యాలోచనమున కడ్డుగలిగెను

“పూర్ణా! లాటరీ సొమ్మువచ్చిన మరునాడే నేను ప్రయాణమగుట నిశ్చయము”

“నేనుమాత్రము ప్రయాణముకానా?”

“ఎచ్చటకు”

“మా పుట్టింటికి”

వామనుఁడు పకాలున నవ్వెను పూర్ణబొమల ముడి వెను

వామనునకుఁ బూర్ణను దనతోఁ దీసికొని యేగుట యేమియు నిష్టములేదు పూర్ణతో రైలు ప్రయాణమనిన నతనికి బొత్తిగఁ గిట్టదు ఆ యనుభవమతనికి చాలగలదు. బండి బయలుదేరుటకు సిద్ధముగ నున్నంతవరకు పూర్ణ ముస్తాబు పూర్తికాదు చెమటలు గ్రక్కుకొనుచు, హుటాహుటిని జట్కాలోబడి కూలీలతో బరుగులెత్తి, చంకను పిల్ల వానిని వేలవేసుకొని పూర్ణను జేయిపట్టుకుని వేగముగ నడిపించుచు రైలుబండియందు బడుట వామనునకుఁ బరిపాటయి పోయినది ఇంజనుకూత వినబడును ‘అయ్యో! అయ్యో! మీ తొందరనుంచి పువ్వులు పెట్టుకొనుట మరచిపోయితిని ప్లాట్‌ఫారమ్ అవతల చేమంతులవిగో కనబడుచున్నవండీ! ఒక్క చెంగుని వెళ్లిరండీ! యని పూర్ణయనును బండినుండి దుమికి పువ్వులవానిని కేక వేసి పిలిచి, కొని, చిల్లరకు తబ్బిబ్బులుపడి, తుదకేలాగుననో బండి నడచుచుండ పూలతో పూర్ణకడ కేతెంచుట-బండి నెక్కినపిదప కాళ్లు జాచుకొని పుస్తకమో పత్రికయో చదువుకొనుచు గూర్చుండుటకు వీలా! పెద్ద ట్రంకు పెట్టెలు, మూడు పరుపులు, పిల్లల యాటవస్తువులబుట్ట, టిఫెన్ కేరియర్, పాత్రసామానులబస్తా, యివియన్నియు నచ్చటచ్చట సర్దవలెను పూర్ణకు హాయిగ శయనించుటకు వలయువిధము సమకూర్పవలెను అప్పటికైన నతనికి విశ్రాంతిలేదు ప్రతి స్టేషనునకు దిగక తప్పదు పిల్లలకో పూర్ణకో, కావలయునుగాన ఫలహారములో, తేనీరో, మంచినీరో ఎందుకొరకో-బండిదిగుట యెక్కుటయు తప్పదు ఇంతఁ జేసినను పూర్ణమూతివిరుపులు, గొణుగులు, ధుమధుమలు, తప్పవు అందుచే వామనుఁడు, పూర్ణ పుట్టింటికి ప్రఁయాణ సన్నాహముఁ జేయకముందే, విదేశములకేగ నూహించెను

“నేనొకకాని ఖర్చుచేసిన, పూర్ణ రూపాయి వెచ్చించితినని సాధించును ఆమెచేయు వ్యయమునకు లెక్కలేదు నేనడ్డలేను లాటరీటికట్ పూర్ణది, నాదిగాదు, ఇప్పుడే యామె పుట్టింటివారికి నపరిమితధనము నడపుచున్నది నే నార్జించినది నాకీయుటకే వేయిమూలుగులు పూర్ణ మూలుగును లక్షమాటలాడును లాటరీలో లక్ష రూపాయిలు వచ్చిన పుట్టింటివారికెంత యొసగునో ఆమె యన్నలు, యక్కలు, చెల్లెండ్రు, అత్తలు, మేనమామలు, శరపరంపరలుగ నిచ్చుటకు వచ్చుట నిశ్చయము. లాటరీ

(తరువాయి 137-వ పేజీలో)